

వంటనూనెల విక్రయ కౌంటర్ ప్రారంభం

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌లో గల విజయ గణపతి ఆయిల్ మర్చంట్స్, శివుని బొమ్మ సెంటర్‌లోని మహాలక్ష్మి రోటరీ ఆయిల్స్‌లో వంట నూనెల ప్రత్యేక కౌంటర్‌ను శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభించారు. పాకెట్ పామాయిల్ ధర రూ.110లకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ పాకెట్ రూ.124లకు విక్రయించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.













మహర్నవమి వేళ.. అలంకార లీల



నరసరావుపేటలో చండీ అలంకరణలో శారదాంబ అమ్మవారు

వినుకొండలో మహిషాసురమర్దనిగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

రొంపిచర్లలో మహిషాసురమర్దని అలంకరణలో వాసవీ అమ్మవారు

నరసరావుపేటలో మహిషాసురమర్దనిగా పాతూరు శివాలయం పార్వతీ అమ్మవారు

రహదారుల అభివృద్ధికి నిధులివ్వండి

ఆర్అండ్‌బీ మంత్రిని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట: నియోజకవర్గంలో లో లెవల్ చప్టాలు స్థానంలో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణంతో పాటు పలురోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన రోడ్ల అభివృద్ధిపై మంత్రితో చర్చించారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

బొల్లాపల్లి: మండలంలోని చక్రాయపాలెం శుక్రవారం కారంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రమ్య, వైద్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. గత వారం రోజులుగా చక్రాయపాలెంతో పాటు పరిసరాల గ్రామాలైన హనుమాపురం, రాజానాయక్ తండా, బీఎల్ కాలనీలో వాంతులు, విరేచనాలతో కావడం దగ్గరలోని కారంపూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కె.లక్ష్మా నాయక్, వైద్యసేవలు అందజేసిన వారిలో సూపర్‌వైజర్ కె.మల్లయ్య, బీఎల్ మస్తాన్‌వలి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

10న రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్ ప్రారంభం

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాసు బ్లడ్‌సెంటర్‌ను నవంబరు పదో తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్‌సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లా వైద్యశాల 200 పడకల సామర్థ్యం కలిగి ఉందని, పేద ప్రజలకు రోగులందరికీ సేవలు అందిస్తుందని అన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తులమురళి, డాక్టర్ రెహమతుల్లా, డాక్టర్ సృజన, శ్రీనివాసగుప్తా, బ్లడ్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళిధర్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



చిలకలూరిపేట: రోడ్ల నిర్మాణం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. నాదెండ్ల మండలం కనపర్రు నుంచి ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం వరకు రహదారి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఉపాధి హామీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో పెద్దఎత్తున రోడ్ల నిర్మాణ పనులు తమ ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామీణ సమస్యలు తీర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు.

నరసరావుపేటలో యువకుడు ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పనసతోటకు చెందిన షేక్ సలీం (35) అదే ప్రాంతంలోని మీసేవ వద్ద గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.


వేధింపులు తాళలేక...

నరసరావుపేటటౌన్: వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఆమె మృతికి భర్త కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన కొమ్ము సౌజన్య (25)కు నరసరావుపేటకు చెందిన ఆర్లగడ్డ ఏసుబాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి స్థానిక కంభంపాలెంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సౌజన్య మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ ఒగ్గెకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు వైద్యశాల వద్దకు చేరుకున్నారు. తన కుమార్తె మృతికి అత్త, మరిది వేధింపులే కారణమంటూ తండ్రి కొమ్ము నాగరాజు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగదంబకు అక్షరాకృతి



వినుకొండ (నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారులు బి.ప్రసాద్ విజయదశమి సందర్భంగా చిత్రం గీశారు. ఈ చిత్రాన్ని అక్షర అమ్మవారి చిత్రాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. నుదుటిపై బొట్టులో ఓం అనే అక్షరంతో ముక్కు మీద దుర్గా దేవి అక్షరాలు పెదవిపై దసరా అని తలపై విజయదశమి అని కంఠంపైన శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రీకరించారు. చిత్రాన్ని తిలకించిన ప్రజలు ప్రసాద్‌ను అభినందించారు.









సీపీఎం మండల శాఖకు నూతన కార్యవర్గం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల గ్రామంలో సీపీఎం మండల శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ ఏచూరి సీతారాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నూజెండ్ల గ్రామ శాఖ కార్యదర్శిగా పాలెపోగు ఆశీర్వాదంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీశ్వరరెడ్డి, కె.హనుమంతరెడ్డి, వై.సత్యనారాయణ, జి.శివరామయ్య, తదితరులు పాల్గొన్నారు.





